


నారా లోకేష్‌ను కలిసిన దంపూరి భాస్కర్ యాదవ్



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: యువగళం పాదయాత్రలో నెల్లూరు జిల్లాలో పర్యటిస్తున్న యువనేత నారా లోకేష్‌బాబుని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీవారి ప్రసాదాలు ఇచ్చి దుస్సాలతో సత్కరించారు. లోకేష్‌బాబు మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, పోతుకుంట విజయబాబు పాల్గొన్నారు.

ఆగస్టు 9న 'క్విట్ మోదీ.. సేవ్ ఇండియా' ఆందోళనలు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహారావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 9న 'క్విట్ మోడీ... సేవ్ ఇండియా' పేరుతో జరగనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని మాయాబజార్‌లోగల సిఐటియు కార్యాలయంలో రెండో రోజు సిఐటియు ప్రాంతీయ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ పేరుతో లక్షల కోట్ల ప్రజల ఆస్తులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు ధారపోస్తోందని, ఇటువంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు. దేశభక్తి పేరుతో అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం అత్యంత దేశద్రోహ విధానాలను అనుసరిస్తోందని, ప్రజావ్యతిరేక విధానాలను తెచ్చి వాటిని ప్రతిఘటించే వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ నిరకుంద పద్ధతుల ద్వారా నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని అన్నారు. ప్రైవేటీకరణల ఫలితంగా ప్రజల సంపద అంతా బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవడమే కాకుండా 30 మిలియన్ల మంది ఉద్యోగులు, కార్మికుల ఉపాధి భద్రత ప్రమాదంలోకి నెట్టివేస్తుదని అన్నారు. ఆగస్టు 9న చేపట్టాల్సిన కర్తవ్యాలను ఈసదస్సులో చర్చించి భవిష్యత్ ఆందోళనలను చేపట్టాల్సి ఉందని అన్నారు. కార్మిక సోదరులంతా ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సురేంద్ర, అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజనేయులు, అంగన్‌వాడీ కోశాధికారి ఎస్.వాణిశ్రీ, శ్రామికమహిళ జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి, గూడూరు సిఐటియు నాయకులు జోగి శివకుమార్, ఏ.ప్రసాద్, బి.గోపీనాథ్, బివి రమణయ్య, బి.రమేష్, ఎస్.సురేష్, పెంచలప్రసాద్, బి.చంద్రయ్య, ఎస్.ముత్యాలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహారావు

టీటీడీ ఆయుర్వేద వైద్యంపై ప్రై'వేటు'

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయుర్వేద ఆస్పత్రి వైద్యుల ప్రైవేట్ వైద్యంపై పాలకమండలి వేటు వేసింది. దీంతో టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రిలోని కొందరు వైద్యులు గిలగిలలాడుతున్నారు. టీటీడీ ఆయుర్వేద వైద్యశాలను ఒక వ్యవస్థగా బలోపేతం చేసే క్రమంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి కలిసి సంస్కరణలు చేపట్టినట్టు ప్రచారం జరుగుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, బర్డ్, అశ్వినీ, సెంట్రల్, పద్మావతి, ఆయుర్వేద ఆస్పత్రులు నడుస్తున్నాయి. పేదలకు ఉచితంగా, అలాగే నామమాత్ర ఫీజులతో మెరుగైన వైద్యం అందిస్తున్నాయి. వీటిన్నింటిని టీటీడీకి సంబంధించి వెలకట్టలేని ఆస్తులుగా భావిస్తూ, వాటిని బలోపేతం చేసేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వాటిలో పనిచేసే వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై టీటీడీ నిషేధం విధించింది.

టీటీడీ వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయకుండా ఉండేందుకు వారికి నాన్ ప్రాక్టీస్ అలివెన్స్‌లను టీటీడీ అందజేస్తోంది. కేడర్‌ను బట్టి వారికి అలవెన్స్ సొమ్మును ఇవ్వడం గమనార్హం. అయితే టీటీడీ ఆయుర్వేద వైద్యులు పాలక మండలి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కింది కోర్టు మొదలుకుని, సుప్రీంకోర్టు వరకూ న్యాయపోరాటం చేశారు. అయితే వారికి సానుకూల తీర్పు రాలేదు.



ఈనేపథ్యంలో టీటీడీ పాలకమండలిని మెప్పించి తిరిగి ప్రైవేట్ ప్రాక్టీస్‌కు అనుమతి సాధించుకున్నారు. దీంతో వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి తమ వద్దకు వచ్చే రోగులకు తమ దళారుల ద్వారా మాయమాటలు చెప్పి, ప్రైవేట్ వైద్యశాలలకు తరలిస్తూ కొందరు ఆయుర్వేద వైద్యులు సొమ్ము చేసుకుంటున్నారు. సాక్ష్యాత్తు కలియుగ దైవం శ్రీవారి ఆశీస్సులతో నెలకొల్పిన ఆయుర్వేద ఆస్పత్రిగా భావించి, దీర్ఘకాలిక, ఇతరత్రా రోగాలతో బాధపడుతున్న రోగులు పెద్దసంఖ్యలో తిరుపతికి వెళుతున్న పరిస్థితి.

భారతీయ వైద్యాన్ని ప్రోత్సహించే సదాశయంతో టీటీడీ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శద్ధ కనబరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రిని ఏకంగా 250 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దారు. ప్రతిరోజూ ఓపీ సంఖ్య 400కు పైమాటే. అయితే ఆయుర్వేద వైద్యానికి డిమాండ్, రోగుల భయాన్ని సొమ్ము చేసుకునేందుకు ఈ ఆస్పత్రిలోని కొందరు సీనియర్ వైద్యులు ప్రైవేట్ వైద్యానికి తెరలేపారు. ఇక్కడికి వచ్చే రోగులను తమ ఆస్పత్రికి తరలించే దళారీ నెట్‌వర్క్‌ను ఏర్పరచుకుని పెద్దఎత్తున సొంత ఆస్తుల్ని పెంచుకుంటున్నారు.

మరోవైపు తిరుపతి ఆయుర్వేద ఆస్పత్రిని ఒకవ్యవస్థగా బలహీనపరుస్తూ, కేవలం వ్యక్తిగత పరపతిని పెంచుకునేందుకు కొందరు వైద్యులు ప్రయత్నిస్తుండడంపై యాజమాన్యానికి భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో గత నెల 19న ఆయుర్వేద వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై టీటీడీ ఆయుర్వేద వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయవద్దని నిషేధం విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈనెల నుంచి అమల్లోకి వచ్చేలా ఆదేశాలు ఇచ్చారు. విధాన పరమైన నిర్ణయం వెనుక టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, తిరుపతి జేఈవో సదా భార్గవి సత్సంకల్పం ఉందని చెబుతున్నారు. మంచి నిర్ణయం తీసుకున్నందుకు వారంతా అభినందనలు అందుకుంటున్నారు. టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రిలోని నలుగురైదుగురు సీనియర్ వైద్యులు మినహాయించి, మిగిలిన వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నెల లోపు శ్రీనివాస సేతు పనులు పూర్తి : కమిషనర్



శ్రీనివాస సేతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత, ట్రాఫిక్ డిఎస్పి స్వామి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నెలాఖరు లోపు శ్రీనివాస సేతు మొత్తం నిర్మాణ పనులు పూర్తి అవుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన శ్రీనివాస సేతు పిల్లర్లపై రెండవ గడ్డర్ అమర్చే పనులను శుక్రవారం మధ్యాహ్నం నగరపాలక, రైల్వే ఇంజినీర్లు, ఆఫ్కాన్స్ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ, టిటిడి సంయుక్తంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన జరుగుతున్న గడ్డర్స్ అమర్చే పనులు పూర్తి అయితే శ్రీనివాస సేతు మొత్తం పూర్తి అవుతుందన్నారు. వారం రోజుల క్రితం ఒక గడ్డర్ అమర్చామని, శుక్రవారం రెండవ గడ్డర్ అమర్చే పనులు పూర్తి అయ్యాయన్నారు. మరోవారం లోపు మూడవ గడ్డర్ అమరుస్తారని అన్నారు. అటు తరువాత పెండింగ్ ఉన్న సెగ్మెంట్స్ అమర్చే పనులు పూర్తి అవుతాయని అన్నారు. ఇప్పటికే మూడు దశల్లో పూర్తి అయిన మార్గాల్లో వాహనాలు అనుమతించామన్నారు. అన్ని పనులు నెలాఖరు లోపు పూర్తిచేస్తామన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఎస్.పీ. నరసప్ప, రైల్వే ఇంజినీర్లు, పోలీసులు, ఆఫ్లాన్స్ ప్రతినిదులు స్వామి, తదితరులు ఉన్నారు.

ఆగస్టు 15లోపు ఆడిటోరియం పనులు పూర్తి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ఆర్ట్ స్టూడియోలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం పనులు ఆగస్టు 15వ తేదీ లోపు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుడా కార్యాలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆర్ట్ స్టూడియో పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ లోపు ఆడిటోరియం పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. 600మంది కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా ఆడిటోరియం ఏర్పాటు చేశామన్నారు. ఆడిటోరియంలో ముందు వరుసలో విఐపిల కొరకు ప్రత్యేకమైన సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. డీఈ దేవిక, బిఎస్ఆర్ సంస్థ ప్రతనిధులు ఉన్నారు.

12,13న జిల్లాలో

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పర్యటన : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల జూలై 12,13 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని అందుకు తగిన ఏర్పాట్ల ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జెసి డికె.బాలాజీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారుల పిడి నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట ఆర్డీఓలు కిరణ్ కుమార్, చంద్రమునితో మాట్లాడుతూ జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖకేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల 12న రేణిగుంట- నాయుడుపేట జాతీయరహదారి ఎన్హెచ్-71 మార్గంలో ఆజాదీ కాఆమత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి పెద్దఎత్తున సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతం నుంచి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సాయంత్రం 4గంటలకు ప్రారంభించనున్నారని తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. మరుసటి రోజు 13న తిరుపతి పట్టణంలోని తారకరామ స్టేడియంలో కష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2,3,4కు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించి శంఖుస్థాపన చేయనున్నారని, ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

గురుకుల ప్రవేశాల్లో డీసీవో చేతివాటం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల ప్రవేశాల్లో జిల్లా సమన్వయకర్త చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ మునెయ్య ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ హోటల్లో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశమయ్యారు. మునెయ్య మాట్లాడుతూ ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు కాకుండా తక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రవేశం కల్పిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో అర్హత ఉన్న విద్యార్థులకు మొండిచెయ్యి చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీటుకో రేటు చొప్పున డీసీవో గురుకుల ప్రవేశాలను అమ్మేశారనీ, ఆమెకు ఓ మంత్రి, ఎమ్మెల్యే అండ ఉందని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి తిరుపతి జిల్లాలో జరుగుతున్న గురుకుల ప్రవేశాల అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు చెప్పారు.

బర్డ్‌లో నెలకు 25 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలకు ప్రణాళికలు

రెండు రోజుల్లో 10 మంది పిల్లలకు విజయవంతంగా సర్జరీలు

టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో వినికిడి లోపంతో బాధ పడుతున్న చిన్నారులకు బర్డ్ ఆసుపత్రిలో రాబోయే రోజుల్లో నెలకు 25 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ఉచితంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రిలో శుక్రవారం కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసుకున్న పిల్లలతో ఛైర్మన్ మాట్లాడారు. అనంతరం ఈవో ఎవి.ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి, ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లె రెడ్డెప్పరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి శ్రీవారి ఆశీస్సులతో కొత్త జీవితం ప్రసాదించాలనే సదాశయంతో గతఏడాది మేలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి బర్డ్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. మొదటనెలకు ఒక సర్జరీతో ప్రారంభమైన ఈప్రయత్నం తరువాత నెలకు మూడు దాకా చేసే స్థాయికి చేరుకుందన్నారు. ఆ తరువాత స్వామివారి ఆశీస్సులు, వైద్యుల కషితో కొద్ది కాలంలోనే నెలకు 10 సర్జరీలు చేసే స్థాయికి చేరుకుందని వివరించారు. ఇందులో భాగంగానే రెండు రోజుల్లో 10 మంది పిల్లలకు సర్జరీలు చేసి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించినట్టు చెప్పారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ఈసి వినయ్‌కుమార్, డాక్టర్ రాంబాబు నేతత్వంలో ఈ సర్జరీలు నిర్వహించారన్నారు. రూ.7లక్షల నుండి రూ.14లక్షల వరకు ఖర్చయ్యే ఈ ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. టీటీడీ నిర్వహిస్తున్న శ్రవణం ప్రాజెక్టులో సుమారు 120మంది పిల్లలు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం పేర్లు నమోదు చేసుకున్నారని, దశలవారీగా వీరందరితో పాటు ఇతరులకు కూడా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటివరకు 48 మందికి విజయవంతంగా ఈ సర్జరీలు చేశారని, రాబోయే రోజుల్లో మరిన్ని సర్జరీలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు.

చిరుత దాడిలో గాయపడిన

చిన్నారి కౌశిక్ పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: అలిపిరి నడక మార్గంలో చిరుతదాడిలో గాయపడిన చిన్నారి కౌశిక్‌ను శ్రీవారే రక్షించారని టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. 14 రోజుల చికిత్స అనంతరం పూర్తి ఆరోగ్యంతో ఉన్న చిన్నారిని శుక్రవారం ఛైర్మన్ సమక్షంలో వైద్యులు డిశ్చార్జి చేశారు. ఈసందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడారు. జూన్ 22న రాత్రి చిన్నారిపై చిరుత దాడి జరిగిందని, టీటీడీ అధికారులు వెంటనే స్పందించి శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించారని చెప్పారు. ప్రత్యేక వైద్యబందం పర్యవేక్షణలో బాలుడికి చికిత్స జరిగిందని వివరించారు. ప్రస్తుతం బాలుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. అటవీ శాఖ సహకారంతో చిరుతను బంధించి దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలిపెట్టామని చెప్పారు. నడకమార్గాల్లో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారని తెలియజేశారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన బాలుడి తల్లిదండ్రులు బి.పులికొండ, బి.శిరీష మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దయతోనే తమ బిడ్డ ప్రాణాలతో దక్కాడని సంతోషం వ్యక్తం చేశారు . స్వామి వారికి తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అలాగే చిరుత దాడి జరిగిన 15 నిమిషాల్లో టీటీడీ ఈవో శ్రీఎవి.ధర్మారెడ్డితోపాటు ఇతర అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని తమ బిడ్డను చిన్నపిల్లల అసుపత్రికి తరలించారని చెప్పారు. వీరికి కూడా ధన్యవాదాలు చెబుతున్నామని చెప్పారు. ఆసుపత్రిలో వైద్యులు ఎంతో ఓపికగా మెరుగైన వైద్యం అందించి పూర్తి ఆరోగ్యంతో తమ బిడ్డను తిరిగి అప్పగించారని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యం చక్కగా చేస్తున్నారని, పారిశుద్ధ్యం మెరుగ్గా ఉందని చెప్పారు. ఉచితంగా తమ బిడ్డకు వైద్యం అందించారని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో సదా భార్గవి, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వద్దు


సిఎండి కె.సంతోష రావు



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: సంస్థ పరిధిలో వ్యవసాయ విద్యుత్తు సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలని ఎపిఎస్ పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అధికారులను ఆదేశించారు. ఎపిఎస్ పిడిసిఎల్ తిరుపతి సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం తిరుపతి రూరల్ డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని సూచించారు. రైతులకు పగటిపూట 9గంటల విద్యుత్తు సరఫరాకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా నియంత్రికలు మరమ్మతుకు గురైతే తక్షణమే నియంత్రికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసిన వెంటనే సర్వీసులను మంజూరు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వినియోగదారులకు నిరంతరం అందుబాటులో వుంటూ విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912 లేదా 1800 425 155333కు కాల్‌చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి రూరల్ సబ్‌డివిజన్ పరిధిలో చేపడుతున్న కొన్ని పనులల్లో అవకతవకలు జరిగినట్లు తమ దష్టికి వచ్చిందని, ఈ అంశంపై విజిలెన్స్ విభాగంచే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. అవకతవకలు రుజువైతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎస్ పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు కె.గురవయ్య, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.కష్ణారెడ్డిలతోపాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వాసురెడ్డి, సుబ్బారావు, అమర్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, అకౌంట్స్ విభాగపు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ టర్మ్ ముగిసిన తర్వాతే ఎన్నికలు

తిరుపతి ఎమ్మెల్యే భూమన



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: చంద్రబాబు నాయుడుకి నాలుగేళ్లుగా నిద్రలేకుండా చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతి 30వ డివిజన్ నెహ్రూనగర్‌లో శుక్రవారం ఉదయం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో భూమన కరుణాకర రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద రోజూ ఒకే రకమైన విమర్శ చేస్తే ప్రజలు నమ్మరని భావించి... చంద్రబాబు, చంద్రబాబును సమర్థించే ప్రసార మాధ్యమాలు కొత్త విషయం చెబుతున్నట్టుగా నటిస్తూ, రోజుకొక కొత్త వంట వండుతున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్నిరకాల మోసపూరిత ప్రకటనలు చేసినా, చేయించినా రానున్న ఎన్నికల్లో గెలుపు మాత్రం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే నని ధీమా వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్న తమకు ప్రజాభిప్రాయం స్పష్టమైందన్నారు. కేవలం ప్రెస్‌క్లబ్‌ల్లో కూర్చుని పత్రికా సమావేశాల నిర్వహణకే పరిమితమైన వారికి వాస్తవాలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికే చంద్రబాబుకు నాలుగు సంవత్సరాలుగా జగన్ మోహన్ రెడ్డి నిద్ర లేకుండా చేశారని, ఈ ఏడాదితో పాటు మరో ఐదేళ్లూ చంద్రబాబు నిద్రపోయే పరిస్థితి లేదని భూమన పేర్కొన్నారు. శాసనసభ పూర్తి కాలం సరిగ్గా ముగిసిన తర్వాతే ఎన్నికలు వస్తాయని స్పష్టం చేశారు. చంద్రబాబును, చంద్రబాబును సమర్థించే పవన్ కల్యాణ్ ను జగన్ మోహన్ రెడ్డి ఓటు అనే వజ్రాయుధంతో నరుకుతారని పేర్కొన్నారు.

జగనన్న సురక్షలో ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: పేదవాళ్ళను ఓడించడానికే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఒక్కటవుతున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం తిరుపతి నగరంలో కనకభూషణం లేఅవుట్ పద్మావతిపార్క్ వద్ద, ఎల్‌బి.నగర్, శ్రీకష్ణానగర్ సచివాలయాల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన క్యాంపులలో సర్టిఫికెట్లను ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ, తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ అందచేశారు. కార్పోరేటర్లు నరేంద్రనాథ్, ఈశ్వరీ, పైడి సునీత, కోఆప్షన్ సభ్యులు ఇమామ్ నేతత్వంలో క్యాంపులు నిర్వహించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డివిజన్ నాయకులు డిష్ చంద్రా, మాజీ జెడ్‌పిటిసి వెంకటముని రెడ్డి, వీర అనీల్, తిమ్మారెడ్డి, పడమటి కుమార్, మాకం చంద్ర, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల ప్రతిపాదనలను ఆమోదించాలి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నగరంలో పలుచోట్ల రోడ్ల ప్రతిపాదనలను ఆమోదించాలని టీటీడీ జేఈవో ఎస్టేట్ ఆఫీసర్లతో చర్చించడం జరిగింది. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా విశాలమైన రోడ్లు ఉంటే నగర జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయనే ఉద్దేశంతో మరిన్ని రోడ్లను ప్రజలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించడం జరిగింది. శ్రీనివాసం వెనుక భాగంలో సామవాయి మార్గం నుంచి వైఎస్సార్ మార్గ్ కలుపుతూ 40 అడుగుల రోడ్డు, చెన్నారెడ్డి కాలనీలోని శ్మశానం మీదుగా ఇస్కాన్ టెంపుల్ రోడ్డుకు 40 అడుగుల రోడ్డు, ఎస్వీ యూనివర్సిటీ లోపల జూపార్క్, అలిపిరి రోడ్డుకు కలుపుతూ మూడు మాస్టర్‌ప్లాన్ రోడ్లు, తిలక్ రోడ్డు నుండి జబ్బార్ లేఔట్ మీదుగా బిఎస్ఎన్ఎల్ ఆఫీస్, గంగమ్మ గుడి రోడ్డుకు కలుపుతూ 40 అడుగుల రోడ్డు వేయనున్నారు. ఈ రోడ్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటుగా జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు, బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి

దళిత మహిళపై సర్పంచ్ పరుష పదజాలం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పంచాయతీకి ముఖ్య భద్రతను కల్పించి, అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బృహత్తర బాధ్యతను భుజానెత్తుకున్న తూకివాకం సర్పంచ్ సిద్ధపు రెడ్డిగారి మునిశేఖర్‌రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని... అదే పంచాయతీకి చెందిన 2వ వార్డు ధనమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు శ్రీకాంత్, కార్యదర్శి పవన్ కుమార్, దళిత సంఘాల నాయకులతో కలిసి ధనమ్మ మాట్లాడారు. తాను గతంలో చేసిన సేవా కార్యక్రమాల ఫలితంగా పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యురాలిగా ఎన్నికయ్యానన్నారు. అయితే తనని గెలిపించిన వార్డు ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు దళితులకు హక్కులు ఉండాలని, ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని సొంత నిధులతో నిర్మిస్తుంటే సర్పంచ్ దానిని అడ్డుకుంటూ తన అనుచర వర్గంతో బెదిరింపులు చేస్తున్నాడని ఆరోపించారు. విగ్రహ ఏర్పాటు ఎలాగైనా పూర్తి చేయాలనే ఉద్దేశంతో సర్పంచ్‌కు గౌరవంగా నమస్కరిస్తే పరుష పదజాలాన్ని ఉపయోగించి తనకు వార్నింగ్ ఇచ్చారన్నారు. పంచాయతీకి చెందాల్సిన చెరువుల వేలం డబ్బులను సర్పంచ్ కుటుంబ సభ్యులే పంచుకుంటూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని, ఎటువంటి రసీదులు లేకుండా టన్నుల కొద్ది ఇసుకను అక్రమంగా నిల్వ చేసిన విషయంలో పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపీ హోటల్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా అంజి



ప్రజాశక్తి-తిరుపతి: ఏపీ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా విల్లీస్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత అంజి ఎంపికయ్యారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవుల్లో అందరికీ అందుబాటులో ఉంటూ సేవాకార్యక్రమాలు నిర్వహించాలని తిరుపతికి చెందిన శ్యామ్‌సాయి ఆకాంక్షించారు.

ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలోని కూరపర్తివారిపల్లి పంచాయతీ గంపలమాదిగపల్లెలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం భారీగా కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పల్లెపాటి నాగరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, గిరి, పాపయ్య, రెడ్డప్ప, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

విజయభాస్కర్‌రెడ్డి తండ్రికి ఆనం పరామర్శ



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిసి ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి తండ్రి సిద్ధా రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నెల్లూరు బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి బొల్లినేని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. విజయభాస్కర్ రెడ్డిని కలిసి సిద్ధా రెడ్డి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పెరికెలంపాటి కంఠిగ మురళీరెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన విజిలెన్స్ సిఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. గత ఆరు నెలలుగా గూడూరు పట్టణం టౌన్ ప్లానింగ్ సంబంధించి విజిలెన్స్ అధికారులు మున్సిపల్ అధికారులను నివేదికలు అడిగారు. ఆ నివేదిక పంపడంలో అలసత్వమనందున ఆ వివరాలకు సంబంధించి కమిషనర్‌ని కలిసి వివరాలు సేకరిస్తున్నామని విజిలెన్స్ సిఐ తెలిపారు.

గోశాలకు ఆవు, దూడ వితరణ





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ గోశాలకు సుమారు ఒక లక్ష విలువచేసే ఆవు, దూడను బెంగళూరుకు చెందిన వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు శుక్రవారం వితరణ చేశారు. ఆదేవిధంగా గోశాల నిర్వహణకు రూ.30 వేలు విరాళం అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని, అందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని పిసిసి ఎస్సీ విభాగం చైర్మన్ గౌడపేరు చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎన్నడూ లేని విధంగా దళితులపై దాడులు, అత్యాచారాలు, వారి భూముల ఆక్రమణలు, హత్యలు, అక్రమ కేసులు పెరిగిపోయాయని ఆరోపించారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సైతం తుంగలో తొక్కేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులపై రాజ్యాంగం, కోర్టు తీర్పులు, ఐఏఎస్ అధికారుల కమిటీ నివేదిక ఒకలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం న్యాయశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీ అందుకు భిన్నమైన నివేదిక ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలుకాకుండా ఐఏఎస్‌లు తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదన్నారు. ఇది అమలు జరిగితే పదోన్నతులు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రివర్షన్ తప్పదని చెప్పారు.

జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు సులభతరం


పుత్తూరు టౌన్:


తొట్టంబేడు:



నాయుడుపేట:

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడుతోందని.. జగనన్న సురక్షతో సేవలు సులభతరం అయ్యాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం పుత్తూరు మున్సిపల్ పరిధి ఎన్జీవోస్ కాలనీ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా సచివాలయ వ్యవస్థను తెచ్చి ప్రభుత్వసేవలు ప్రజలచెంతకే తీసుకెళ్లి ప్రజల పక్షాన నిలబడ్డ ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమే అన్నారు. సంక్షేమం.. అభివద్ధి సమపాళ్లలో చేస్తూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమం అందాలన్న ఉద్దేశంతో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించడంతోపాటు అక్కడ ఎదురైన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు విడుదల చెయ్యడంతో పాటు జగనన్న సురక్ష పేరుతో సర్టిఫికెట్లు, సేవలు అందిస్తున్నామన్నారు. విజన్ ఉంది.. విస్తరాకుల కట్ట ఉంది అనే చంద్రబాబు ఏనాడైనా ప్రజారోగ్యం గురించి, రైతుల గురించి, మహిళల గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. గెలిస్తే హామీలు మరచిపోవడం.. ఓడిపోతే పారిపోవడం ఆయన నైజమన్నారు. నగరి టీడీపీ ఇన్‌ఛార్జిగా తిరుగుతున్న వ్యక్తి నాలుకకు ఎముకలేదని.. ఇష్టానికి వాగుతుంటాడని..తనను తిట్టడం తప్ప వేరేది తెలియదన్నారు. మహిళల శక్తితో పాటు, జగనన్న జెండా.. అజెండా తనకు అండగా ఉందని నియోజకవర్గంలో మూడోసారీ తాను గెలవడం ఖాయమన్నారు. నియోజకవర్గ పరిశీలకులు శ్రీకాళహస్తికి చెందిన మధుసూధన రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఎప్పుడు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉంటారు తప్ప తాము ఏం మంచి చేశామో చెప్పి ప్రజలముందుకు వెళ్లరన్నారు. ఎందుకంటే వారు ప్రజలకు ఎలాంటి మంచి చేయలేకపోవడమే అన్నారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయ ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎంఎన్ రెడ్డి, కౌన్సిలర్లు , అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: పంచాయతీల అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె తొట్టంబేడు మండలంలోని బసవయ్యపాలెం సచివాలయం పరిధిలో నిర్వహించిన "జగనన్న సురక్ష" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవిత్ర రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి "జగనన్న సురక్ష" అనే కార్యక్రమం తీసుకొచ్చి ప్రతిఒక్క అధికారి గ్రామాల్లోకి వెళ్లి రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు అందజేయాలని ఆదేశించారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక సూర్యుడు ఉదయించకముందే వాలంటీర్ తలుపు తట్టి అవ్వతాతలకు పింఛను అందజేస్తున్నారని తెలిపారు. కల్లిపూడి, తాటిపర్తి పంచాయతీలకు రూ.ఐదు కోట్ల వ్యయంతో నూతన తారు రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ, ఎంపిటీసీ శోభన్ బాబు, సర్పంచ్ శంకర్, నాగేంద్ర, కోవి చంద్రయ్య నాయుడు, తిరుపతి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఢిల్లీ బాబు, స్పురాయులు, కొన్నలి రమేష్, హరి బాబు, గోపి,పెరుమాళ్ రెడ్డి, ముని, వెంకటేష్, రాజ, గోపాల్, మాధవయ్య, హరి, సుబ్రమణ్యంనాయుడు, జెసిఎస్ కన్వీనర్ భక్తవత్సలం, కష్ణ, దాము, భాస్కర్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ కటకం దీపిక అన్నారు. శుక్రవారం నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. అర్హత ఉండి ఇంకనూ సంక్షేమ పథకాలు అందనివారికి అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఎన్డీసీసీబీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, నాయుడుపేట పట్టణ జెసిఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి, పాలేటి నాగార్జున, పలువురు కౌన్సిలర్లు, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు, వాలంటీర్లు, గహసారథులు,పలువురు వైసిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

వెంకటగిరి: యాతలూరు సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ సెక్రటరీ రాజేశ్వరి, పంజాం సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీరాజ్ టాస్క్‌ఫోర్స్ డీఈ నందకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల రెవెన్యూ అధికారి పద్మావతి మాట్లాడుతూ జగనన్న సురక్షలో భూ సమస్యలు తప్ప మిగిలిన సర్టిఫికెట్లు అన్ని త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు తంబిరెడ్డి తనూజా శివారెడ్డి, సర్పంచ్ పంజాం పెంచలమ్మ, మండల ఉపాధ్యక్షులు ఈరి. పెంచలయ్య, వైసీపీ నాయకులు గిరి రెడ్డి, శివారెడ్డి, సదానంద రెడ్డి,ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్సై నరసింహ రావు , ఇరిగేషన్ ఏఈ బాబు, హౌసింగ్ ఏఈ, సొసైటీ ప్రెసిడెంట్ నాగయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి:



బోగస్ ఓటర్లను తొలగించాలని వినతి



ప్రజాశక్తి-కేవీబీపురం: సత్యవేడు నియోజకవర్గంలోని గ్రామాల్లో స్థిర నివాసం లేని ఓటర్లు ఎక్కువగా ఉన్నాయని.. వాటిని తొలగించాలని సిపిఎం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్ సత్యవేడు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి, పుత్తూరు, ఉత్తుకోట సమీపంలోని పట్టణాల్లో ఓటర్లుగా ఉంటూ ఇదే నియోజకవర్గంలో ఓటర్లుగా ఉంటున్నారని తెలిపారు. చనిపోయిన వారు, పెళ్లయిన మహిళలు, ఇతర ప్రాంతాలకు నివాసం వెళ్లిన వారు ఓటర్లుగా ఉన్నారన్నారు. ఈ ఓట్లను అధికారులు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈఆర్‌వో మాట్లాడుతూ బీఎల్‌వోలతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జనార్ధన్ తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ



ప్రజాశక్తి-పిచ్చాటూరు: గరిష్ట కూలి వచ్చేలా కూలీలచే ఉపాధి పనులు చేయించాలని అంబుడ్స్‌మెన్ రాసరాయుడు, క్లస్టర్ ఏపీడీ సరిత ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఉదయం పిచ్చాటూరు అరణియార్ లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో పండ్ల తోటలు, పూల సాగు చేసుకునేందుకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో నాగభూషణమ్మ, జేఈ పుష్పరాజ్, టీఏ ధనంజయులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో రక్తదానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎల్ఐసి యూనియన్ వారోత్సవాలలో భాగంగా పుత్తూరు ఎల్ఐసి కార్యాలయం ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సిద్ధార్థ కాలేజ్ విద్యార్థులు, శ్రీవిద్యా కళాశాల, శ్రీ సాయి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని రక్త దానం చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ నాయకులు కృష్ణకుమార్, వెంకట ముని, బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు దస్తగిరి, కార్యదర్శి లక్ష్మణకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ప్రజాశక్తి-నాగలాపురం: విద్యాభివృద్ధికి ఉత్తమ సేవలు అందించి బదిలీపై వెళ్లిన 50 మంది ఉపాధ్యాయులను శుక్రవారం సత్యవేడు శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఎంఈవో బాబయ్య అధ్యక్షతన స్థానిక వ్యాపార సంఘ కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్ఎం ప్రభాకర్‌రాజు, వైసీపీ కన్వీనర్ అపరంజిరాజు, సర్పంచ్ సుధా చిన్నదొరై, ఎంపీపీ సింధు శ్యామ్ , సురేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకురలో పసికందుకు అరుదైన శస్త్రచికిత్స



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలోని అంకుర ఆసుపత్రిలో తొమ్మిది నెలల శిశువుకు అఫెండిక్యులర్ ఫెర్ఫొరేషన్ అనే అరుదైన సమస్యకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు వంశీకృష్ణ తెలిపారు. స్థానిక రేణిగుంటరోడ్డులోని హీరో షోరూం సమీపంలో ఉన్న అంకురా ఆసుపత్రిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధునిక మౌలిక సదుపాయాలు, సంరక్షణతో ప్రసిద్ధిగాంచిన ప్రఖ్యాత మహిళా, పిల్లల ఆసుపత్రి అంకుర ఆసుపత్రిలో ఇటీవల అపెండిక్యులర్ పెర్ఫొరేషన్ అనే అరుదైన సమస్యతో బాధపడుతున్న తొమ్మిది నెలల శిశువుకు ఇక్కడి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి, ఆ పసికందు ప్రాణాలను కాపాడారని వెల్లడించారు. సాధారణంగా అఫెండెక్స్ అనేది చిన్నపిల్లల్లో రావడం చాలా అరుదన్నారు. అందులోనూ రెండు సంవత్సరాలలోపు వయస్సు వారిలో చాలాతక్కువుగా వస్తుందన్నారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలు, సాదర వాతావరణానికి ప్రసిద్ధి చెందిన అంకుర ఆసుపత్రి 9 నెలల బాలుడు జాష్విక్ ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషిచిందన్నారు. జస్వికన్ ఇటీవల వారి రాయచోటికి చెందిన వారి తల్లిదండ్రులు అంకుర ఆసుపత్రికి తీసుకొచ్చినప్పడు ఆ చిన్నారికి జ్వరం, కడుపునొప్పి, వాంతాలు వంటి ఆందోళనకర లక్షణాలు కనిపించాయని అన్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన వైద్యబృందం వెంటనే సిటిస్కాన్ నిర్వహిస్తే అపెండిక్యులర్ పెర్ఫొరేషన్ ఆనవాళ్లు కనిపించాయన్నారు. ఈ పరిస్థితి శిశువుల్లో చాలా అరుదగా ఉన్నప్పటికి తక్షణ శ్రద్ధ అవసరమైందన్నారు. వెంటనే సర్జన్ డాక్టరు విఠల్‌మోహన్ పర్యవేక్షణలో డాక్టరు వంశీ, డాక్టరు పృథ్వీ, డాక్టర్ దినేష్‌లతో కూడిని పిడియాట్రిక్ ఇంటెన్సివిస్టుల బృందం ఆధ్వర్యంలో జష్విక్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారన్నారు. ఆసుపత్రిలోనే ఉంచి వైద్య నిపుణులు రోగికి చికిత్స చేసే సమయంలో తలెత్తిన సమస్యలను క్షుణంగా పరిశీలించి, వాటిని సరిదిద్దడం ద్వారా రోగి కోలుకునేలా చేశారని తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, అత్యంత నిపుణులైన వైద్యబృందం, అంకిత భావం కలిగిన వైద్యసిబ్బంది ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతిఒకరికి కృతజ్ఞతలు తెలిపారు. మాతా, శిశు సంరక్షణ కోసం నిరంతరం కృషి చేసిన అంకుర ఆసుపత్రిని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తల్లులు, పిల్లలకు సరైన, నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. వైద్యులు, చిన్నారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు క్యాన్సర్ లక్షణాల గుర్తింపుపై శిక్షణ అందించాలి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలోని మహిళా ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలకు క్యాన్సర్ లక్షణాల గుర్తింపుపై ఈనెల 10వ తేదీ నుండి కనీసం 50మందికి తక్కువ లేకుండా శిక్షణ, ప్రాక్టికల్ వంటివి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కాన్సర్ కమిటీ సభ్యులైన డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా నుండి ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న కాన్సర్ స్క్రీనింగ్ విధానం పగడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈవిధానంలో 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు మొదటి ప్రాధాన్యతగా చికిత్సలు అందించాలని నిర్ణయించామని, ప్రతి సచివాలయ పరిధిలో గల మహిళల ఎంఎల్‌హెచ్‌పిలకు ఎఎన్ఎంలకు ఒకరోజు స్వరే విధానం, మరో రెండురోజులు ఆసుపత్రిలలో కాన్సర్ గుర్తింపుపై చికిత్స పొందుతున్న పేషెంట్ల పరిశీలన వంటివి పూర్తిచేసి త్వరగా ఆయా సచివాలయ పరిధిలో యాప్‌సర్వే ప్రారంభించాలన్నారు. సర్వేలో లక్షణాలు ఉంటే పింక్ బస్సుకు అనుసంధానం అవుతుందని, పింక్ బస్ పర్యటన సందర్భంగా వైద్యపరీక్షలు, చికిత్స ప్రారంభం అవుతుందన్నారు. సివియర్ కేసులు వెంటనే ఆసుపత్రికి పంపే విధంగా ఏర్పాటు జరగాలని సూచించారు. పింక్‌బస్ పర్యటన షెడ్యూల్ సచివాలయ వాలింటర్లు రెండు మూడు రోజుల ముందుగానే అవగాహన కల్పించాలని లక్షణాలు కలిగిన ఎఒక్కరు చికిత్సకు దూరం కారాదని అన్నారు. ట్రైనింగ్ మెటీరియల్, యాప్‌లు సిద్ధం కావాలన్నారు. కడిఎంహెచ్ఓ శ్రీహరి, స్విమ్స్ డాక్టర్ జయచంద్రారెడ్డి, ఎస్వి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, డాక్టర్ భారతి, టాటా కాన్సర్ ఆసుపత్రి డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై జేసీ సమీక్ష



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మండలంలోని భూముల రీసర్వేపై తహశీల్దారు పరమేశ్వరస్వామి, రెవెన్యూ సిబ్బందితో జిల్లా సంయుక్త కలెక్టర్ బాలాజీ శుక్రవారం పుత్తూరులోని కార్యాలయంలో సమీక్షించారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సెబ్ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను సెబ్ అధికారులు అదుపులోకి తీసుకొని వారి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. సెబ్ ఎస్సై శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట యూ.పి స్కూల్‌లో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుపై ఆరోపణలు వచ్చిన మరుసటి రోజున అదే స్కూల్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ అనే ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం ఉదయం ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలోనే విద్యార్థుల తల్లిదండ్రులు లక్ష్మీనారాయణకు దేహశుద్ధి చేశారు. ఎంఈఓ అక్కడికి చేరుకొని విద్యార్థులు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాకాల: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని, 10, 11వ తేదీల్లో తిరుపతి కలెక్టరేట్ ఎదుట జరగబోయే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు మధుసూదన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా జీతాలు పెంచి ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని అన్నారు. అంగన్వాడీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లు, వారికి వయోపరిమితి 50 సంవత్సరాల వరకు పెంచాలన్నారు. 300 మంది జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. మండల సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలంఅటవీ ప్రాంతంలోని భాకరాపేట, ఎస్ఆర్ పాళ్యం ప్రాంతాల్లో టాస్క్ ఫోర్స్ బలగాలు శుక్రవారం 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం తిరుపతి నుంచి భాకరాపేట అడవుల్లోని జిల్లెలమంద మీదుగా కూంబింగ్ నిర్వహిస్తుండగా ఉస్తికాయలపెంట అటవీ ప్రాంత పరిధిలోని మంగుమామిడితోట వద్ద గురువారం కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారని తెలిపారు. దుంగలను పడేసి పారిపోయారన్నారు. ఆరు ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. రాజంపేట నుంచి ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం ఎస్ఆర్ పాళ్యం సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టగా రోళ్ల మడుగు వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారని, వారు టాస్క్ ఫోర్సు సిబ్బందిని గమనించి దుంగలు పడేసి పారిపోయారన్నారు. 9 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. మొత్తం 15 దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషనుకు తీసుకుని వచ్చి కేసు నమోదు చేసి, రెండు కేసులను సీఐ జి. శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

పురపాలక శానిటరీ మేస్త్రిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పురపాలక పరిధిలోని పోటుపాలెం ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులచే తన వ్యక్తిగత పనులు, ఇంటి పనులు చేయిస్తూ అడిగిన వారిపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్న పురపాలక శానిటరీ మేస్త్రి కాశీ రత్నం పై చర్యలు చేపట్టాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పురపాలక మేస్త్రి కాశీ రత్నం ప్రవర్తన సరిగా లేదని, పారిశుధ్య కార్మికులు మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు తెలిపినా చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.